



# కరపత్రం

SINCE 2014

శనివారం అక్టోబర్ 03, 2026 | సంపుటి : 2 | సంచిక : 355 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





# ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ ప్రారంభం

- త్వరలో కామన్ పాస్‌లోకి ఆటోలు
- రోజూ 35 లక్షల మంది ప్రయాణం
- ఒకే పాస్‌తో బస్సు--మెట్రో ప్రయాణం
- మీ-సేవ కేంద్రాల్లోనూ కామన్ పాస్
- ప్రజా రవాణా మరింత సులభతరం
- ట్రాఫిక్, కాలుష్యం తగ్గించడమే లక్ష్యం

**హైదరాబాద్:**
నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. నగరంలో ప్రజా రవాణాను ప్రోత్సహించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ ఆర్టీసీ,మెట్రో రైల్ కామన్ పాస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎస్ సంజయ్ జాజు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ.. నగర ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు ఆర్టీసీ బస్సులు, మెట్రో రైల్‌కు కామన్ పాస్ విధానాన్ని ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా తొలి దశలో ఆర్టీసీ, మెట్రో రైల్ సేవలను కామన్ పాస్ పరిధిలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

### ♦ రోజూ 35 లక్షల మంది ప్రయాణం

హైదరాబాద్‌లో ప్రతిరోజూ దాదాపు 30 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో, మరో 5 లక్షల మంది మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్నారని సీఎస్ తెలిపారు. చాలామంది ప్రయాణికులు ఇంటి నుంచి మెట్రో స్టేషన్‌కు, అక్కడి నుంచి తమ గమ్యస్థానానికి సమీపంలోని స్టేషన్‌కు, ఆపై అక్కడి నుంచి కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానానికి చేరుకోవాల్సి వస్తోందన్నారు. ఇలా ఒకే ప్రయాణంలో పలుమార్లు రవాణా మారాల్సి రావడంతో ప్రయాణికులకు అదనపు వ్యయంతో పాటు సమయం, శ్రమ కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

మిగతాద్ది 2 లో

# 'నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దు'

- విజయ ఆయిల్‌ను తెలంగాణకే పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా విస్తరించాలి
- విజయ బ్రాండ్‌ను జాతీయ స్థాయి బ్రాండ్‌గా తీర్చిదిద్దాలి: మంత్రి తుమ్మల
- ఆయిల్‌పామ్ సాగును 10 లక్షల ఎకరాలకు విస్తరించడమే లక్ష్యం
- రైతులకు అవసరమైన మొక్కలు, డ్రిప్ సకాలంలో అందించాలి
- ఆయిల్‌పామ్ రైతులకు మార్కెట్, ధర విషయంలో ప్రభుత్వం అండగా ఉంటుంది


2 లో

శివరాంపల్లిలో టీజీ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ మెగా ఆయిల్ ప్యాకింగ్ కేంద్రాన్ని, మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. విజయ వంట నూనెల విక్రయ కేంద్రానికి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 20 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ప్రారంభమైన విజయ ఆయిల్ ప్యాకింగ్ కేంద్రం నేడు రోజుకు 200 మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి ఎదగడం గర్వకారణమని మంత్రి తుమ్మల అన్నారు. విజయ ఆయిల్‌ను ఈ స్థాయికి తీసుకువచ్చిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ప్రైవేట్ ఆయిల్ బ్రాండ్ల ఆధిపత్యాన్ని తగ్గించి, ప్రజలకు నాణ్యమైన వంట నూనెలను సరసమైన ధరలకు అందించడంతో పాటు ధరల స్థిరీకరణ లక్ష్యంతో విజయ ఆయిల్ ప్యాకింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విజయ ఆయిల్ తొలినాళ్లలో వేరుశనగ, పొద్దుతిరుగుడు, పామాయిల్ వంటి మూడు రకాల వంట నూనెలను అందించగా, ప్రస్తుతం రైస్ బ్రాన్, నువ్వుల, దీపం, కొబ్బరి తదితర ఆరు రకాల వంట నూనెలను వినియోగదారులకు అందిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. విజయ్ బ్రాండ్ అంటే నాణ్యతకు గుర్తింపు అని, ప్రజల్లో ఉన్న ఈ నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా వినియోగదారుల విశ్వాసాన్ని కాపాడుకోవాలని సూచించారు.

శివరాంపల్లిలో ఏర్పాటు చేసిన మెగా ఆయిల్ ప్యాకింగ్ కేంద్రం పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో, పరిశుభ్రమైన, హైజెనిక్ వాతావరణంలో వంట నూనెలను ప్యాకింగ్ చేసేలా రూపొందించామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఉత్పత్తి సామర్థ్యంతో పాటు నాణ్యతను మరింత పెంచాలని సూచించారు. మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభంతో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ మార్కెట్‌లోకి విజయ అడుగుపెట్టిందని తెలిపారు.



# ఖైరతాబాద్‌లో వందశాతం మేమే గెలుస్తాం..

**హైదరాబాద్:**
ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజవర్గం ఉప ఎన్నికల్లో కచ్చితంగా తామే గెలుస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. వందకు వందశాతం తామే గెలుస్తామన్నారు. ఉప ఎన్నికల్లో ప్రభుత్వ పార్టీకి కొంత అడ్వాన్స్ ఉంటుదనే మాట వాస్తవమే కావొచ్చు కానీ తాము ఇక్కడ గెలిచి చూపెడాతామన్నారు

2 లో



# కెప్టెన్ స్మిత్ మచ్చర్ తెగువకు టీజీ గవర్నర్ ప్రశంసలు

- కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్య సాహసాలు దేశానికి గర్వకారణం
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

**హైదరాబాద్:**
ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలను లెక్కచేయకుండా 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్

# రాహుల్‌కు హరీష్ లేఖ

- ప్రైవేటీకరణపై వెంటనే జోక్యం చేసుకోవాలి
- ట్రాన్స్‌కో, జెన్‌కో, సింగరేణి, డిస్కంలపై ఆందోళన
- తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడ్డుకోవాలి
- ఢిల్లీలో ఒక విధానం.. తెలంగాణలో మరో విధానమా?
- కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు చేస్తున్నారా?
- ప్రజా ఆస్తుల ప్రైవేటీకరణ దుర్మార్గం: హరీష్


2 లో

# ప్రయాణికులకు బిగ్ షాక్..
## తెలంగాణలో పెరిగిన ఆటో ఛార్జీలు



2లో..

**హైదరాబాద్:**
తెలంగాణలో ఆటో రిక్షా ప్రయాణికులకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. చాలా కాలంగా డిమాండ్ చేస్తున్న ఆటో ఛార్జీల పెంపుపై ఎట్టకేలకు ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆటో రిక్షా కొత్త ఛార్జీలను అధికారికంగా ఖరారు చేస్తూ జీవో నంబర్ 46ను జారీ చేసింది. ఈ మేరకు తక్షణమే తదుపరి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రవాణా శాఖను ప్రభుత్వం ఆదేశించింది.


2లో..

# కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుకుంటున్న ప్రజలు

- వారసత్వ రాజకీయాలకు గాంధీ వ్యతిరేకం
- గాంధీ అసలైన వారసుడు మోదీ, బీజేపీ: బండి
- తెలంగాణలో రామరాజ్యం తెస్తాం
- దేవుళ్ల పేరుతో హిందువులను చీల్చే ప్రయత్నం: ఆరోపణ
- డబుల్ ఇంజిన్ సర్కారుతోనే అభివృద్ధి

**జమ్మికుంట:**
దేశ ప్రజలు కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట గాంధీచౌక్‌లో మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.



# ముంబయి--బెంగళూరుకు మరో వందేభారత్ స్లీపర్

- దసరా కానుకగా ప్రారంభించే అవకాశం
- వారానికి 6 రోజులు రైలు సేవలు
- రాత్రి 10 గంటలకు బెంగళూరు నుంచి బయల్దేరుతుంది
- మొత్తం ప్రయాణ సమయం 16 గంటలు
- ఏపీలో అనంతపురం, గుంతకల్లు హాల్ట్
- రాయచూర్, కలబురగి, సోలాపూర్, పుణె, కల్యాణ్‌లోనూ ఆగుతుంది

2 లో

సుదూర ప్రయాణాలు చేసే ప్రయాణికుల కోసం ఉద్దేశించిన వందేభారత్ స్లీపర్ రైలు మరో మార్గంలో త్వరలో అందుబాటులోకి రానుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి, టెక్నాలజీ రాజధానిగా గుర్తింపు పొందిన బెంగళూరు మధ్య రెండో వందేభారత్ స్లీపర్ రైలు సేవలందించనుంది. దసరా కానుకగా ఈ రైలు సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కొత్త రైలుకు రైల్వే బోర్డు ఆమోదం తెలపగా.. ప్రారంభ తేదీపై త్వరలోనే స్పష్టత రానుంది.

# తెలంగాణలో నీటి గండం


మిగతాది 2లో

- సాధారణం కంటే 17% వర్షపాతం లోటు
- 33 జిల్లాల్లో 18 జిల్లాల్లో వర్షాభావం
- రిజర్వాయర్లలో 331 టీఎంసీల నీటి లోటు
- చెరువుల్లో 40% పావువంతు కూడా నిండలేదు
- భూగర్భ జలాలు మరింత అడుగంటుతున్నాయి
- సాగు విస్తీర్ణం 15.55 లక్షల ఎకరాలు తగ్గింది
- రాబోయే నెలల్లో తాగునీటి టెన్షన్?
- కరువు ముప్పుపై ప్రభుత్వానికి పరీక్ష


02

# సంతోషీమాత ఆలయంపై దాడి.. బీజేపీ రాష్ట్ర చీఫ్ ఫైర్

**హైదరాబాద్:**
దిల్‌సుఖ్ నగర్‌లోని సంతోషీమాత ఆలయంపై జరిగిన దాడిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఖండించారు. సంతోషీమాత ఆలయాన్ని సందర్శించిన ఆయన పూజారులు, భక్తులతో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పూజలు జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి ఆలయంలోకి చొరబడి అమ్మవారి విగ్రహంపై కర్రతో దాడి చేశాడు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో ఆలయాలపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఈ ఘటనల వెనుక ఒకే తరహా ప్యాటర్న్ కనిపిస్తోంది.

# పులి కోసం 14 ఏళ్ల ఎదురుచూపులు.. కవ్వాల్ టైగర్ జోన్‌పై ఎందుకు రగడ?



2లో..

తెలంగాణలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2012లో టైగర్ జోన్ ఏర్పాటు చేసి పులుల కోసం ఆవాసం సిద్ధం చేస్తున్నా.. దశాబ్దానికి పైగా గడిచినా పులుల సంచారం ఆశించిన స్థాయిలో లేదని స్థానికులు అంటున్నారు.

మిగతాద్ది 2 లో

# తెలంగాణలో నీటి గండం.. తగ్గిన వానలు, అడుగంటుతున్న జలాలు

తెలంగాణలో వానాకాలం ముగిసినా నీటి టెన్షన్ మొదలైంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. 33 జిల్లాల్లో 18 జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొన్నాయి. రిజర్వాయర్లలో నీటి నిల్వలు గతేడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గగా.. చెరువులు నిండక భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సాగు, తాగునీటి అవసరాలపై రాబోయే నెలల్లో ఆందోళన నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది.

వానాకాలం వెళ్లిపోయింది. కానీ తెలంగాణలో నీటి టెన్షన్ మొదలైంది. ఎల్ నినో ప్రభావంతో ఈసారి వానలు ఆశించినంతగా పడలేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో సాధారణంగా పడాల్సిన వానతో పోలిస్తే 17 శాతం లోటు నమోదైంది. 33 జిల్లాల్లో ఏకంగా 18 జిల్లాలు వర్షాభావంలోనే ముగిశాయి. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**▪ వాన లెక్కలోనే లోటు**

రాష్ట్రం మొత్తానికి లెక్క వేస్తే వాన కొంత పడినట్టే కనిపిస్తుంది. కానీ పల్లెకు వెళ్లి చూస్తే అసలు కథ తెలుస్తుంది. ఒక చోట వాన పడితే, మరోచోట చినుకు కూడా సరిగ్గా పడలేదు. ఒక్క చెట్టు నీడతో అడవి చల్లబడుతుందా అన్న తీరులో కొన్ని ప్రాంతాల్లో పడిన వాన రాష్ట్రం మొత్తం లోటును పూడ్చలేకపోయింది. 2023లో తెలంగాణలో 861 మి.మీ. వర్షం పడింది. అది సాధారణం కంటే 17 శాతం ఎక్కువ. ఇప్పుడు మాత్రం సాధారణ వర్షపాతం కంటే 17 శాతం లోటు నమోదైంది. రెండేళ్లలోనే వాన లెక్క తలకిందులైంది.

**▪ ప్రాజెక్టుల్లో నీటి లెక్క**

ఇక అసలు చిక్కు నీళ్ల దగ్గర మొదలవుతుంది. సెప్టెంబర్ 30 నాటికి కృష్ణా, గోదావరి పరిధిలోని తెలంగాణ రిజర్వాయర్లలో కలిపి సుమారు 503 టీఎంసీల నీరు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ఈ నిల్వ 835 టీఎంసీలకు పైగా ఉంది. అంటే ఏడాదిలో దాదాపు 331 టీఎంసీల తేడా కనిపిస్తోంది. కృష్ణా బేసిన్‌లో ఈసారి 323 టీఎంసీలకు పైగా నీరు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 583 టీఎంసీలకు పైగా ఉంది. గోదావరి బేసిన్‌లోనూ ఈసారి సుమారు 180 టీఎంసీలు ఉంటే.. గత ఏడాది 252 టీఎంసీలకు పైగా నిల్వ ఉంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ లెక్కలు చూస్తే నీటి కొరత మరింత స్పష్టంగా కనిపిస్తోంది. శ్రీశైలంలో గతేడాది 153.56 టీఎంసీలు ఉంటే.. ఈసారి 61.65 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. నాగార్జునసాగర్‌లో గతేడాది 174.25 టీఎంసీలు ఉంటే.. ఈసారి 44.89 టీఎంసీలకు పడిపోయింది.

**▪ చెరువులు నిండక బోర్లపై భారం**

తెలంగాణలో దాదాపు 44 వేల చెరువులు ఉన్నాయి. వాటిలో దాదాపు 40 శాతం చెరువులు పావు వంతు కూడా నిండలేదని ప్రభుత్వం తెలిపింది. చెరువు నిండితే బోరుకు ఊపిరి. చెరువు ఎండితే పల్లెకు కష్టం. చెరువు నిండితే ఊరు నిండినట్టే అనే పాత మాట ఇప్పుడు మళ్లీ గుర్తుకొస్తోంది. చెరువుల్లో నీరు లేకపోతే భూగర్భ జలాలు కూడా పెరగవు. సెప్టెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో భూగర్భ జలాల సగటు లోతు 11.24 మీటర్లకు చేరింది. నెల మొదట్లో అది 7.52 మీటర్లుగా ఉంది. అంటే నెల రోజుల్లోనే నీటి మట్టం గణనీయంగా దిగింది. బోరు లోతు పెరిగితే మోటారు ఖర్చు పెరుగుతుంది. డీజిల్‌తో నీళ్లు తోడితే రైతు ఖర్చు మరింత పెరుగుతుంది. వాన కోసం ఆకాశం వైపు, నీళ్ల కోసం బోరు వైపు చూస్తున్న పరిస్థితి ఏర్పడింది.

**▪ సాగు నీళ్లేవి?**

ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 123.74 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. గత ఏడాది ఇదే సమయంలో 139.29 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. అంటే దాదాపు 15.55 లక్షల ఎకరాలు తగ్గాయి. వరి సాగు కూడా గత ఏడాదితో పోలిస్తే దాదాపు 18 శాతం తగ్గింది. నీరు పుష్కలంగా ఉండే పంటల నుంచి తక్కువ నీటితో పండే పంటల వైపు వెళ్లాలని రైతులకు సూచిస్తున్నారు. రైతు పరిస్థితి మాత్రం లెక్కల్లో కనిపించినంత తేలిక కాదు. విత్తనం వేసి పంట పెంచాడు. మధ్యలో వాన ముఖం చాటేస్తే పెట్టుబడి పోతుంది. బోరు నీటితో కాపాడాలంటే మరో ఖర్చు. నీరు అందకపోతే దిగుబడి తగ్గుతుంది. పంట చేతికి రాకపోతే రైతు చేతిలో మిగిలేది అప్పే.

**▪ తాగునీటి టెన్షన్ మొదలవుతుందా?**

ఇక తాగునీటి లెక్క కూడా ఇప్పుడు కీలకంగా మారింది. హైదరాబాద్‌కు నీరు అందించే సింగూర్ వంటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. సరఫరా కొనసాగుతున్నా రాబోయే నెలల్లో నిల్వలు తగ్గితే ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అంటే సమస్య రైతు పొలంలోనే కాదు. ఇంటి కుండ దగ్గర కూడా ఉంది. సాగుకు నీళ్లు కావాలి. పల్లెకు తాగునీరు కావాలి. పట్టణాలకు నీరు కావాలి. నీరు తగ్గినప్పుడు ముందు ఎవరి అవసరం తీరాలి అన్నదే అసలు సవాల్.

**▪ సర్కార్ ముందున్న పరీక్ష**

ఇందుకే ప్రభుత్వం ఇప్పుడు ఆల్‌పార్టీ సమావేశానికి సిద్ధమవుతోంది. ఎల్‌నినో ప్రభావం, వర్షాల లోటు, కరువు పరిస్థితులపై అన్ని పార్టీల సలహాలు తీసుకోనుంది. కేబినెట్ సబ్‌కమిటీ కూడా పరిస్థితిని అధ్యయనం చేయనుంది. కానీ పల్లెకు కావాల్సింది సమావేశాలు కాదు. నీళ్లు. రైతుకు కావాల్సింది మాటలు కాదు. పంటకు నీరు. ఇంటికి కుళాయి వస్తుందన్న నమ్మకం కావాలి. బోరు ఎండిపోతుందేమో అన్న భయం పోవాలి. ముందు జాగ్రత్తే మేలు అన్న తీరులో ఇప్పుడు నీటి లెక్క ముందే వేసుకోవాల్సిన సమయం. వానాకాలం ముగిసింది. రిజర్వాయర్లలో నీళ్లు గత ఏడాదికంటే చాలా తక్కువగా ఉన్నాయి. చెరువుల్లో నిల్వలు తగ్గాయి. భూగర్భ జలాలు దిగుతున్నాయి. సాగు విస్తీర్ణం తగ్గింది. వాన తగ్గింది. నీళ్లు తగ్గాయి. ఇప్పుడు ప్రభుత్వానికి అసలు పరీక్ష మొదలైంది. తెలంగాణలో కరువు తలుపు తడుతోందా అన్న ప్రశ్నకు లెక్కలు మాత్రం గట్టిగానే హెచ్చరిస్తున్నాయి.

## రాహుల్ గాంధీకి హరీష్ లేఖ

మొదటిపేజీ తరువాయి

ఏఐసీసీ నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు లేఖ రాశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ అంశానికి సంబంధించి రాహుల్ గాంధీకి హరీష్ లేఖ రాశారు. ఈ ప్రైవేటీకరణ అంశంపై రాహుల్ వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. టీజీ-ట్రాన్స్‌కో, టీజీ-జెన్‌కో, సింగరేణి, డిస్కంల ప్రైవేటీకరణకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు.
కాంగ్రెస్ జాతీయ విధానం ఢిల్లీలో ఒకలా.. తెలంగాణలో మరోలా ఎందుకు? అని ప్రశ్నించారు హరీష్, కాంగ్రెస్ మేనిఫెస్టో, రాయ్‌పూర్ ఆర్థిక తీర్మానాలను తెలంగాణ ప్రభుత్వం పాటిస్తుందా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్మించిన ప్రజా ఆస్తులను రేవంత్ ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు.

## ముంబయి--బెంగళూరుకు మరో వందేభారత్ స్లీపర్

మొదటిపేజీ తరువాయి

ముంబయి- బెంగళూరు వందేభారత్ స్లీపర్ రైలు వారానికి ఆరు రోజులు నడవనుంది. బెంగళూరు నుంచి సోమవారం మినహా, ముంబయి నుంచి మంగళవారం మినహా ఈ రైలు ప్రయాణికులకు సేవలందించనుంది. ప్రతి రోజూ రాత్రి 10 గంటలకు బెంగళూరులో బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు ముంబయి చేరుకుంటుంది. ముంబయి నుంచి రాత్రి 10.30 గంటలకు బయల్దేరే ఈ స్లీపర్ రైలు మరుసటి రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు బెంగళూరు చేరుతుంది. మొత్తం 16 గంటల సమయం పడుతుంది.

**ఆగే స్టేషన్లు ఇవే:** బెంగళూరు -ముంబయి వందేభారత్ స్లీపర్ రైలు మార్గమధ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, గుంతకల్లు స్టేషన్లలో ఆగుతుంది. వీటితో పాటు రాయచూర్, కలబురగి, సోలాపూర్, పుణె, కల్యాణ్ స్టేషన్లలో హాల్ట్ ఉంటుంది. ప్రస్తుతం ముంబయి- బెంగళూరు నగరాల మధ్య ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ నడుస్తుండగా.. దాదాపు 22 గంటల ప్రయాణ సమయం పడుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డా- అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య తొలి వందేభారత్ స్లీపర్ రైలు ఈ ఏడాది జనవరిలో అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే.

## ఖైరతాబాద్‌లో వందశాతం మేమే గెలుస్తాం..

మొదటిపేజీ తరువాయి

తలసాని. అక్కడ ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడిన సందర్భంలో ఓటర్లు కూడా ప్రతిపక్ష పార్టీ పట్టం కడతారన్నారు. ఖైరతాబాద్ నియోజవర్గం అనేది ప్రత్యేకమైన నియోజకవర్గమన్నారు తలసాని. మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా తలసాని మాట్లాడుతూ.. సీఎం రేవంత్ సిరిసిల్ల పర్యటన ద్వారా ప్రభుత్వంపై చాలా వ్యతిరేకత వచ్చిందన్నారు.
'సీఎం రేవంత్ సిరిసిల్ల పోయాడు.. సిద్దిపేట పోత అంటున్నాడు.. తర్వాత మేము కొడంగల్‌లో సభ పెడతాం. రానున్న రోజుల్లో కరెంట్ కోతలు తీవ్రంగా రానున్నాయి.దేశ రాజకీయాల్లో సెంటిమెంట్ చాలా పని చేస్తోంది. మొన్న మాక్ అసెంబ్లీ పెడితే ఏం జరిగింది చూశాం. మాజీ ముఖ్యమంత్రి ఇంటి మీదకు భూ సర్వే కు పంపిస్తారా?, కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి ఎంపీలు వెళతారా?' అని ప్రశ్నించారు.

## ధైర్యసాహసాలను తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అభినందించారు.

మొదటిపేజీ తరువాయి

**శుక్రవారం లోక్‌భవన్‌లో మాట్లాడుతూ..**
విమానం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న క్షణాల్లోనూ కెప్టెన్ అప్రమత్తత, సమయస్ఫూర్తితో వ్యవహరించారని గవర్నర్ పేర్కొన్నారు. కేవలం 30 సెకన్లు ఆలస్యమైనా పరిస్థితి మరింత విషమంగా మారేదన్నారు. అసాధ్యమనుకున్న పరిస్థితిని తన ధైర్యంతో సాధ్యంగా మార్చి ప్రయాణికుల ప్రాణాలను కాపాడారని ప్రశంసించారు.
కెప్టెన్ స్మిత్ మచ్చుర్ చూపిన తెగువ, మానవతా దృక్పథం భారతదేశానికి గర్వకారణమని గవర్నర్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను అభినందిస్తూ.. కెప్టెన్ సంపూర్ణ ఆరోగ్యంతో మరింత కాలం సేవలందించాలని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ ముక్త భారత్ కోరుకుంటున్న ప్రజలు

మొదటిపేజీ తరువాయి

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వారసత్వ రాజకీయాలకు మహాత్మా గాంధీ వ్యతిరేకమని, గాంధీ అసలైన వారసుడు ప్రధాని నరేంద్ర మోదీ, భాజపానే అన్నారు. ప్రస్తుతం ఉన్న ఇటలీ నేషనల్ కాంగ్రెస్ డూప్లికేట్ గాంధీ కుటుంబానిదేనని విమర్శించారు. రాబోయే రోజుల్లో గాంధీ వారసులుగా తెలంగాణ రాష్ట్రంలో రామరాజ్యం తీసుకొస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుళ్ల పేరుతో హిందువులను చీల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో 32 వేల మంది ముస్లింలు ఉంటే కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని ఆ పార్టీ నాయకులంటున్నారని, 2 లక్షల పైగా హిందువుల ఓట్లు ఉన్నాయనే విషయాన్ని మర్చిపోతున్నారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటేనే అభివృద్ధి సాకారం అవుతుందన్నారు.

## సంతోషీమాత ఆలయంపై దాడి.. బీజేపీ రాష్ట్ర చీఫ్ ఫైర్

మొదటిపేజీ తరువాయి

పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలి. నిందితులకు మతిస్థిమితం లేదంటూ కేసులను పక్కదారి పట్టించొద్దు' పోలీసులను హెచ్చరించారు.నిజంగా మతిస్థిమితం లేకపోతే ఆలయాలనే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారో తేల్చాలన్నారు. ఆలయాల భద్రతపై ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, అన్ని ఆలయాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు, సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వెంటనే బాధ్యునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 'నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దు'

మొదటిపేజీ తరువాయి

విజయ ఆయిల్ ఉత్పత్తులు తెలంగాణకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా అందుబాటులోకి రావాలని మంత్రి తుమ్మల అన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ విజయ్ బ్రాండ్‌కు మంచి మార్కెట్‌ను సృష్టించి, విజయ బ్రాండ్‌ను జాతీయ స్థాయి బ్రాండ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. విజయ ఆయిల్ ఉత్పత్తుల తయారీ, పంపిణీ, విక్రయ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రాష్ట్రంలోని ప్రతి మారుమూల ప్రాంత వినియోగదారుడికి ఉత్పత్తులు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు మూడున్నర లక్షల ఆయిల్‌పామ్ సాగు అవుతుందని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును 10 లక్షల ఎకరాలకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో కనీసం లక్ష ఎకరాల మేర ఆయిల్‌పామ్ సాగు విస్తరించాలని ఆకాంక్షించారు.

ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక పంట అయినందున రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించే విధంగా మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతులు పండించిన ఆయిల్‌పామ్ గెలలను సేకరణ కేంద్రాల ద్వారా ఫ్యాక్టరీలకు తరలించి, సకాలంలో క్రషింగ్ చేసి రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ చేసే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటికే పలు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన మొక్కలు, డ్రిప్ సకాలంలో రైతులకు అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని డ్రిప్ ఇరిగేషన్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు కూడా డ్రిప్ సదుపాయం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆయిల్‌పామ్ దిగుమతులపై విధిస్తున్న దిగుమతి సుంకం విషయంలో కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని మంత్రి తుమ్మల కోరారు. దేశంలో వంటనూనెల అవసరాలను తీర్చే సామర్థ్యం తెలంగాణ రైతులకు ఉందని, రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరిస్తే దేశానికి అవసరమైన వంటనూనెల ఉత్పత్తిలో తెలంగాణ కీలక పాత్ర పోషించగలదని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా దిగుమతి విధానాలను రూపొందించాలని కోరారు.

ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాలపై ఆధారపడి వరి సాగు చేయడం పట్ల జాగ్రత్త వహించాలని, రబీ సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అన్నారు.

భూగర్భ జలాలను సంరక్షించేందుకు ఫామ్‌పాండ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. వర్షపు నీటిని ఫామ్‌పాండ్లలోకి మళ్లించడం ద్వారా భూగర్భ జలాల రీచార్జ్‌కు అవకాశం ఉంటుందని చెప్పారు. రైతులు నీటి సంరక్షణ చర్యలను చేపట్టి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వ్యవసాయాన్ని కొనసాగించాలని సూచించారు.

రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటకు మార్కెట్, ప్రాసెసింగ్, విక్రయ సదుపాయాలు కల్పించే విధంగా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, తెలంగాణను దేశంలోనే ప్రధాన ఆయిల్‌పామ్ ఉత్పత్తి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతాయని మంత్రి పేర్కొన్నారు.

విజయ్ బ్రాండ్‌పై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలని, విజయ ఉత్పత్తులను రాష్ట్ర సరిహద్దులు దాటి దేశవ్యాప్తంగా విస్తరించాలని మంత్రి తుమ్మల సూచించారు.

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ఆయిల్ ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, రిటైర్డ్ ఐ.పి.ఎస్ శ్రీనివాస్ రెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

## పులి కోసం 14 ఏళ్ల ఎదురుచూపులు.. కవ్వాల్ టైగర్ జోన్‌పై ఎందుకు రగడ?

మొదటిపేజీ తరువాయి

పులుల సంరక్షణ పేరుతో తమపై ఆంక్షలు విధిస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ జన్నారం ప్రాంతంలో నిరసనలు, దీక్షలు, బంద్‌లు చేపడుతున్నారు.
పులి కోసం 14 ఏళ్ల ఎదురుచూపులు.. కవ్వాల్ టైగర్ జోన్‌పై ఎందుకు రగడ?
తెలంగాణలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. పులుల సంరక్షణ కోసం టైగర్ జోన్ ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో పులుల సంచారం కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అటవీశాఖ మాత్రం కవ్వాల్‌ను పులులకు అనువైన ఆవాసంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెబుతోంది. దీంతో టైగర్ జోన్‌పై స్థానికులు, అటవీశాఖ మధ్య విభేదాలు ముదురుతున్నాయి.

**2012లో టైగర్ జోన్ ఏర్పాటు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జన్నారం కేంద్రంగా 2012లో కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పాటు చేశారు. మొత్తం 892 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియా, 1,119 చదరపు కిలోమీటర్ల బఫర్ ఏరియాతో టైగర్ రిజర్వ్‌ను ప్రకటించారు. పులులకు అనువైన ఆవాసాన్ని సిద్ధం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పలు సంరక్షణ చర్యలు చేపట్టారు. అడవిలో వన్యప్రాణులకు ఆహారం, నీరు అందుబాటులో ఉండేలా గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు, చెక్‌డ్యాంలను ఏర్పాటు చేశారు.

**పులి కోసం.. వన్యప్రాణులకు ఆహారం, నీటి వసతులు**

పులులకు ప్రధాన ఆహారంగా ఉండే శాఖాహార వన్యప్రాణుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టారు. అడవిలో పచ్చిక బయళ్లను అభివృద్ధి చేయడంతో పాటు నీటి వనరులను పెంచారు. అటవీ భూముల చుట్టూ కందకాలు కూడా ఏర్పాటు చేశారు. టైగర్ రిజర్వ్ పరిధిలోని గ్రామాల పునరావాసంలో భాగంగా మైసంపేట, రాంపూర్ గ్రామాలను కొత్తమద్దిపడగకు తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇన్ని చర్యలు చేపట్టినా.. కవ్వాల్‌లో ఆశించిన స్థాయిలో పులుల సంచారం లేకపోవడంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

**'పులి లేనప్పుడు ఆంక్షలు ఎందుకు?'**

టైగర్ జోన్ ఏర్పాటై దశాబ్దానికి పైగా గడిచినా తమ ప్రాంతంలో పులుల జాడ కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. అలాంటప్పుడు పులుల సంరక్షణ పేరుతో తమపై ఆంక్షలు విధించడం, అభివృద్ధి పనులకు ఇబ్బందులు కలిగించడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. కవ్వాల్ ప్రాంతం పులుల ఆవాసానికి అనువైనది కాదని కొందరు స్థానికులు వాదిస్తున్నారు. పులుల పేరుతో గత కొన్నేళ్లుగా జన్నారం మండల అభివృద్ధి నిలిచిపోయిందని ఆరోపిస్తున్నారు. టైగర్ జోన్‌ను వ్యతిరేకిస్తూ స్థానికులు దీక్షలు, నిరసనలు, బంద్‌లు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జన్నారం పట్టణ బంద్ కూడా చేపట్టారు.

**మానవ సంచారమే సమస్య అంటున్న అటవీశాఖ**

మరోవైపు అటవీశాఖ మాత్రం స్థానికుల వాదనతో విభేదిస్తోంది. కవ్వాల్‌లో పులులు సంచరించకపోవడానికి పలు పర్యావరణ, మానవ జోక్య కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా అడవిలో మానవ సంచారం పెరగడం, వాహనాల రాకపోకలు, నిరంతర అలజడి వంటి అంశాలు పులుల సంచారాన్ని ప్రభావితం చేస్తున్నాయని అధికారులు వివరిస్తున్నారు. ఇందులో భాగంగా గతంలో టైగర్ జోన్ పరిధిలో రాత్రివేళ రాకపోకలను నియంత్రించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ నిర్ణయం వెనక్కి తీసుకున్నారు.

**తడోబా నుంచి పులుల తరలింపు?**

కవ్వాల్‌లో పులుల సంఖ్యను పెంచేందుకు మహారాష్ట్రలోని తడోబా ప్రాంతం నుంచి పులులను తరలించే ప్రతిపాదనపై అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పులులను కవ్వాల్‌కు తీసుకొచ్చి వాటికి అనువైన ఆవాసాన్ని కల్పించాలన్నది అటవీశాఖ ఉద్దేశంగా ఉంది. అయితే ఈ ప్రతిపాదనపై స్థానికుల స్పందన ఎలా ఉంటుందన్నది కీలకంగా మారింది.

**టైగర్ జోన్ కొనసాగుతుందా?**

ఒకవైపు పులుల సంరక్షణ కోసం టైగర్ జోన్ కొనసాగించాలన్నది అటవీశాఖ వైఖరి. మరోవైపు పులుల జాడే లేని ప్రాంతంలో టైగర్ జోన్ పేరుతో తమపై ఆంక్షలు విధించొద్దంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే నిరసనలు తీవ్రతరం కావడంతో కవ్వాల్ టైగర్ జోన్ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. పులుల సంరక్షణ, అటవీ పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానికుల జీవనోపాధి, అభివృద్ధి అవసరాలను ఎలా సమన్వయం చేస్తారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

## ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

ఈ సమస్యను తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఆర్టీసీ,మెట్రో కామన్ పాస్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు.

**◆ కామన్ పాస్‌లోకి ఆటో సేవలు**

భవిష్యత్తులో ఆటో రిక్షా సేవలను కూడా కామన్ పాస్ పరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని సంజయ్ జాజు తెలిపారు. ఆర్టీసీ, హైదరాబాద్ మెట్రో సేవలను మరింత విస్తరించి, సమన్వయంతో పనిచేసేలా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీ, కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**◆ మీ-సేవ ద్వారా కామన్ పాస్**

2011లో ప్రారంభమైన మీ-సేవ కేంద్రాల ద్వారా ప్రస్తుతం దాదాపు 400 రకాల సేవలను అందిస్తున్నామని సీఎస్ తెలిపారు. ఇకపై మీ-సేవ కేంద్రాల ద్వారా కూడా మెట్రో,ఆర్టీసీ కామన్ పాస్‌లను జారీ చేసే సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగర ప్రజలకు ప్రజా రవాణా మరింత సులభంగా, అందుబాటులో ఉండేలా ఆర్టీసీ, మెట్రో రైల్ సంస్థలు సమన్వయంతో ముందుకు సాగుతాయని సంజయ్ జాజు తెలిపారు.

## ప్రయాణికులకు బిగ్ షాక్.. తెలంగాణలో పెరిగిన ఆటో ఛార్జీలు

మొదటిపేజీ తరువాయి

ఆటోలో ప్రయాణం ప్రారంభించిన తొలి 1.6 కిలోమీటర్లకు గాను కనీస ఛార్జీని రూ.30గా ప్రభుత్వం నిర్ణయించింది. తొలి 1.6 కిలోమీటర్ల తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటర్‌కు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు. ప్రయాణ సమయంలో ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల ఆటో ఆగి ఉన్నప్పుడు నిమిషానికి 75 పైసల చొప్పున వెయిటింగ్ ఛార్జీని ఖరారు చేశారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ప్రయాణించే ప్రయాణికులు సాధారణ ఛార్జీపై అదనంగా 50 శాతం అదనపు ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది.

**లగేజీ నిబంధనలు ఇవే**

ఆటోలో ప్రయాణిం చేటప్పుడు వెంట ఉండే లగేజీకి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలను పొందుపరిచింది. ప్రయాణికుడు తన వెంట సాధారణంగా ఉండే బ్రీఫ్‌కేస్, హ్యాండ్ బ్యాగ్‌లను ఉచితంగా తీసుకెళ్లవచ్చు. వీటి మినహా ఇతర పెద్ద ప్యాకేజీలు, లగేజీ ఉంటే వాటికి కిలోమీటరుకు 50 పైసల చొప్పున అదనపు ఛార్జీ వర్తిస్తుంది.ఆటోలో తీసుకెళ్లే లగేజీ గరిష్ఠ పరిమితిని 100 కిలోలుగా పరిమితం చేశారు.

**డిజిటల్ మీటర్ల సవరణకు గడువు**

ప్రభుత్వం ఖరారు చేసిన ఈ కొత్త ఛార్జీలకు అనుగుణంగా ఆటోల్లోని డిజిటల్ మీటర్లను సవరించు కోవడానికి ఆటో డ్రైవర్లు,యజమానులకు మూడు నెలల గడువు ఇచ్చారు. అలాగే ప్రయాణికులకు పాత, కొత్త ఛార్జీల వివరాలు స్పష్టంగా తెలిసేలా ఆటోల్లో విధిగా ఫేర్ కార్డులను ప్రదర్శించాలని అధికారులు స్పష్టం చేశారు.

# గతంలో అమెరికాను సామ్రాజ్యవాద దేశం అన్నవారు

# అమెరికా కుట్రలకు పనిముట్లు అవుతున్నారు

## శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**ఆప్కా అక్బార్ న్యూస్ ఛానల్ సంపాదకుడు, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మరియు రాజకీయ విశ్లేషకులు ప్రదీప్ సింగ్ గారి విశ్లేషణ.**

- **అమెరికా గత 100 సంవత్సరాలుగా ప్రపంచ అగ్రరాజ్యంగా కొనసాగుతోంది.తనను సవాలు చేసిన ప్రతి దేశాన్ని అది ధ్వంసం చేసింది.**
- **జపాన్ అమెరికాను సవాలు చేసినప్పుడు దానిని నాశనం చేసింది.**
- **సోవియట్ యూనియన్ అమెరికాను సవాలు చేసినప్పుడు దానిని 17 ముక్కలుగా విడగొట్టింది.**
- **ఇరాక్ తలెత్తినప్పుడు దానిని అణచివేసింది. ఇరాన్‌పై కూడా అదే విధంగా వ్యవహరించింది.**

**ఈరోజు అమెరికాకు ప్రధాన సవాలు చైనా.**

**అయితే భారత్ భౌగోళిక-రాజకీయంగా మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటున్న నేపథ్యంలో, ఇప్పుడు అమెరికాకు భారత్ తదుపరి తక్షణ లక్ష్యంగా మారింది.**

గత 100 సంవత్సరాలుగా ప్రపంచంలోని టాప్ 10 బిలియనీర్ల జాబితాలో అమెరికన్ పారిశ్రామికవేత్తలే ఆధిపత్యం చెలాయిస్తున్నారు.

10 మందిలో 8 లేదా 9 మంది అమెరికన్లే ఉంటారు. వారితో పోటీ పడే స్థాయిలో మరెవరూ ఉండరు.

**చైనాకు చెందిన జాక్ మా కొంతకాలం ప్రపంచంలో మూడో అత్యంత సంపన్న వ్యక్తిగా ఎదిగినప్పుడు, ఆయనపై లాబీయింగ్ ప్రారంభమై, చివరకు ఆయన వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది.**

- **ఇప్పుడు భారతీయ పారిశ్రామికవేత్తలైన అదానీ, అంబానీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు.**

అమెరికా బలం దాని పారిశ్రామిక రంగంలో ఉంది. సాంకేతికత, వాణిజ్యం ద్వారా అది ప్రపంచాన్ని ప్రభావితం చేస్తోంది.

- **ఏదైనా దేశం లేదా పారిశ్రామికవేత్త తనకు పోటీగా ఎదగడానికి ప్రయత్నిస్తే, వారిని దెబ్బతీయడానికి అమెరికా బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తుంది.**

గత ఐదేళ్లలో భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అత్యంత వేగంగా ఎదిగి, గత సంవత్సరం ప్రపంచంలో రెండో అత్యంత సంపన్న వ్యక్తిగా నిలిచారు.

**ఇదే వేగం కొనసాగి ఉంటే, 2024 నాటికి అదాని ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా మారి, ప్రపంచ దృష్టిని భారత్‌వైపు మరింతగా మళ్లించేవారు.**

పెట్రోల్ డీజిల్ ఇంధనంపై ఇతర దేశాలపై ఆధారపడటం భారతదేశానికి చాలా కాలంగా ఉన్న బలహీనత. ఇదే 1991 ఆర్థిక సంక్షోభానికి దారితీసిన కారణాల్లో ఒకటి. పెరుగుతున్న చమురు దిగుమతి బిల్లులు ఈ బలహీనతను మరింత పెంచాయి.

భవిష్యత్తులో చమురు, సహజవాయువుల స్థానాన్ని భర్తీ చేసే విధంగా, భారతదేశ ఇంధన భద్రతను సాధించాలనే లక్ష్యంతో అదానీ చేపట్టిన తక్కువ వ్యయంతో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ ఈ సమస్యకు పరిష్కారంగా భావించబడుతోంది.

అందుకే హిండెన్‌బర్గ్ సంస్థ అదానీపై పదేపదే దాడులు చేస్తున్నది. జబీదీజ ఇటీవల అదానీ ప్రపంచంలో రెండవ ట్రిలియనీర్ కావచ్చని అంచనా వేసిందని పేర్కొంటూ, ఆయన వ్యాపార సామ్రాజ్యంపై దాడులు మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉన్నది.

"ఆత్మనిర్భర్ భారత్" మరియు "మేక్ ఇన్ ఇండియా" విధానాలను ముందుకు తీసుకెళ్తోందంటే, అది ప్రపంచానికి ఒక భారీ మార్కెట్ అని అర్థం.

ప్రపంచ జనాభాలో దాదాపు 20 శాతం మంది భారతదేశంలోనే ఉన్నారు, అంతేకాకుండా భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోని ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థల కంటే వేగంగా అభివృద్ధి చెందుతోంది.

రాబోయే 20 సంవత్సరాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధిస్తే, అమెరికా, యూరప్, చైనా, అరబ్ ప్రపంచం కూడా భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటాయని అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

భారత రూపాయి డాలర్‌తో పోలిస్తే బలపడుతుంది అని కూడా చెబుతోంది.
భారతదేశంలో కూడా అమెరికా లాబీయింగ్ ప్రారంభమైందని పరిస్థితులు చెబుతున్నాయి.

ప్రతి దేశంలోనూ తమ దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసే వ్యక్తులు ఉంటారు. మన భారత దేశంలో కూడా స్వార్థపరులు దేశ వ్యతిరేక శక్తులు ఉన్నారు.

అమెరికా మీడియాను డబ్బుతో ప్రభావితం చేస్తుంది.
దాదాపు ఒక దశాబ్దం క్రితం భారతదేశంలోని కృష్ణా-గోదావరి (KG) బేసిన్ చమురు, సహజవాయువు ప్రాజెక్ట్‌ను కూడా ఇదే శక్తులు అడ్డుకున్న విషయం మీకు గుర్తుండే ఉంటుంది.

యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్, ట్విట్టర్ వంటి వేదికలన్నీ అమెరికాకు చెందినవే, అవి తమకు నచ్చిన వ్యక్తి లేదా సంస్థపై ఎప్పుడైనా వ్యతిరేక ప్రచార కార్యక్రమాలను ప్రారంభిస్తుంది.

భారతదేశంలో మూర్ఖులకు, దేశద్రోహులకు, విదేశీ ఏజెంట్లకు కొదవ లేదు.

చైనాలో ప్రజాస్వామ్య వ్యవస్థ లేకపోవడం వల్ల అక్కడ ఇలాంటి ప్రచారం వ్యాప్తి చెందడం కష్టం. కానీ భారతదేశం పరిస్థితి వేరు.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ లోని స్వేచ్ఛ స్వాతంత్రం వల్ల అమెరికా తన ఆటలను




భారతదేశంలో ప్రారంభించింది.

అమెరికాతో పటు చైనా కూడా భారతదేశ ఎదుగుదలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నది.

భారతదేశం ముందు మరిన్ని సవాళ్లు ఉన్నాయి.

రష్యాను ఎదుర్కోవడానికి అమెరికా అఫ్ఘనిస్థాన్‌లో బిలియన్ ల ట్రిలియన్ ల డాలర్లను ఖర్చు చేసి తాలిబాన్ వంటి సంస్థలను సృష్టించింది.

శతాబ్దాల పరాయి పాలనతో భారతదేశంలో స్వార్థపరులు, దేశద్రోహులు కూడా చాలామంది పెరిగిపోయారు. మనదేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలోని స్వేచ్ఛను విచ్చలవిడి తనంగా భావించే వారు పుట్టుకొచ్చారు.

ఈ పరిస్థితుల వల్ల భారతదేశాన్ని అస్థిరపరచడం మరింత సులభమని, దేశద్రోహులు, పార్టీలు మారే వ్యక్తులు చాలామంది ఉన్నారని అమెరికాకు తెలుసు.

కొంతమంది భారతీయ నాయకుల ప్రకటనలను గమనించండి, వారు బహిరంగంగానే విదేశీ ఏజెంట్ల మాదిరిగా వ్యవహరిస్తూ భారతదేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు.

ఇక్కడ న్యాయమూర్తులను కొనవచ్చు, మీడియాను కొనవచ్చు, రాజకీయ నాయకులను కూడా కొనవచ్చు" అని అమెరికాకు తెలుసు.

**భారతీయులు జ్ఞానంతో, అప్రమత్తతతో వ్యవహరించడం నేర్చుకునే వరకు భారతదేశం సూపర్ పవర్‌గా మారడం సాధ్యం కాదు.**

భారతదేశం ఒక భారీ మార్కెట్. అందువల్ల ఏ దేశమూ భారత్ స్వయం సమృద్ధి సాధించడాన్ని సహించదు.

కాబట్టి స్వయం సమృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వాలను ఓడించాలి లేదా కూలదోయాలి అనే లక్ష్యంతో విదేశీ శక్తులు పనిచేస్తున్నాయని ఇప్పుడిప్పుడే భారత యువత అర్థం చేసుకుంటున్నాది.

విదేశీ శక్తులకు బలమైన భారతదేశం ఇష్టం ఇష్టం లేదు. మనదేశంలో ఎప్పుడూ పతనం అంచున ఉండే బలహీనమైన, అస్థిరమైన భారత ప్రభుత్వం ఉండాలని అమెరికా కోరుకుంటుంది.

గత పదేళ్లుగా భారతదేశంలో స్థిరమైన, బలమైన జాతీయ బాల ప్రభుత్వం ఉండడంతో అమెరికా ఆటలు సాగడం లేదు.

భారతదేశం తన సొంత పారిశ్రామికవేత్తలను బలోపేతం చేస్తుండటమే విదేశీ శక్తులకు ఆందోళన కలిగిస్తున్నది.

**భారతదేశ రెక్కలను కత్తిరించడమే వారి లక్ష్యం.**

- **ఒక దేశం యొక్క బలం దాని పారిశ్రామిక రంగంలో, పారిశ్రామికవేత్తల్లోనే ఉంటుంది. బలమైన పారిశ్రామికవేత్తలు దేశీయ ప్రతిభను, ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్తారని, భారతదేశం అదే మార్గంలో పయనిస్తోందని అమెరికా గమనించింది.**

- **ఇటువంటి పారిశ్రామిక సంస్థల పారిశ్రామికవేత్తల ప్రయోజనాలను కాపాడటం భారత ప్రభుత్వ బాధ్యత. ఈ రోజు అదానీ, అంబానీ, టాటా, మహీంద్రా వంటి భారతీయ పారిశ్రామికవేత్తలు ప్రపంచ స్థాయిలో పోటీ పడుతున్నారు.**

మన దేశ పారిశ్రామికవేత్తల పతనాన్ని చూసి ఆనందించే వారిని దేశద్రోహులు, విదేశీ ఏజెంట్లు అని పిలవకూడదా?

ఈ దేశద్రోహులు, విదేశీ ఏజెంట్ లు ఎవరు?.. ఇంకెవరు, బొద్దింకలు.

- **వీళ్లే ఆధునిక కాలంలోని దేశద్రోహులు, జై చంద్ లు. ఈ జై చంద్ లు విషపూరితమైన పాముల్లాంటివారని, భారతదేశానికి వ్యతిరేకంగా వచ్చే ప్రతి కథనాన్ని చూసి ఆనందిస్తారని ప్రదీప్ సింగ్ గారు విశ్లేషించారు.**

**భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక కేసు విచారణలో సంబోధించిన బొద్దింకలు అనే పదాన్ని పట్టుకొని కాక్రోచ్ జనతా పార్టీని అమెరికాలో స్థాపించారు.**

- **ఈ కాక్రోచ్ జనతా పార్టీ ఎక్కడ పుట్టింది?.అమెరికాలో పుట్టింది. దీనికి ఎవరు నిధులు సమకూరుస్తున్నారు?.. సొరోస్ మరియు అమెరికా వ్యాపారవేత్తలు. ఇంకో వైపు నుండి చైనా పాకిస్తాన్ లు కూడా ఈ పనిలో ఉన్నాయి.**

బొద్దింకలు అని గర్వంగా చెప్పుకుంటూ అసహ్యమైన పనులు చేస్తున్న ఈ వ్యక్తుల డిమాండ్లు గమనిస్తే, మొత్తం వ్యవహారం అర్థమవుతుంది.

**నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం ను అడ్డంగా పెట్టుకుని సంఘ విద్రోహ శక్తులు ఢిల్లీలో సృష్టించిన అల్లరి అందరు చూశారు. భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ ను టార్గెట్ చేస్తూ మళ్లీ ఇంకొక అలజడి సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు.**

- **ప్రజాస్వామిక ధర్నా పేరు మీద అరాచకం సృష్టిస్తున్న ఈ వ్యక్తుల ఆలోచన భారతదేశము గమనించింది. నవ భారత యువత జెన్ జీ గమనించింది.**

**ఈ బొద్దింకలు దేశం సాధించిన పురోగతిని అంగీకరించడానికి వారు నిరాకరిస్తారు. దేశ పురోగతికి అడ్డం పడుతూ ఉంటారు.కానీ దేశానికి వ్యతిరేకంగా వచ్చే ప్రతి ప్రతికూలమైన పుకారును మాత్రం ఆనందంగా స్వీకరిస్తారు.**

- **ఈ అలజడిని కుట్రలను భారత మీడియా నిస్సహాయంగా చూస్తున్నది. వివరంగా చెప్పాలంటే మీడియా అమ్ముడుపోయింది.**

**ఇలాంటి దేశద్రోహ వ్యక్తులను, నాయకులను మీడియా ప్రశ్నించదు.**

- **కానీ మనం నిస్సహాయులం కాదు.... భారత ప్రజలు భారత యువత ఇప్పుడు సచేతనమయ్యారు. తమ తోటి వారిని ప్రభావితం చేస్తూ జాతిని జాగృత పరుస్తున్నారు.**

**జాగృతమైన భారత జాతి జైత్రయాత్ర మొదలుపెట్టింది.ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా, సోషల్ మీడియా ద్వారా భారతదేశాన్ని విభజించేందుకు అమెరికా చేస్తున్న ప్రచారాన్ని మనం ఓడించగలం.మనం కష్టపడి పనిచేయాలి.కష్టపడి పని చేయడం అంటే అప్రమత్తంగా ఉండడమే.**

- **ఎందుకంటే ఈ దేశం మనది. భారత భవిష్యత్తు మనది. మన భవిష్యత్తు తరాలది.**

**భారత్ మాతాకీ జై**

## కోరుట్ల డిగ్రీ కళాశాలలో రీజువెనేషన్ -- ఫ్రెషర్స్ డే

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**




ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్లలో నూతన విద్యార్థులను ఆహ్వానిస్తూ రీజువెనేషన్ -- ఫ్రెషర్స్ డే "Rejuvenation -- Freshersμ Day" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
కళాశాల ప్రిన్సిపల్ నడికట్ల సందీప్ విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనతో చదువుతూ నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు.
ముఖ్య అతిథిగా హాజరైన కోరుట్ల పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
వైద్యులు డాక్టర్ నడికట్ల సంతోష్ (పల్మనాలజిస్ట్) విద్యార్థులు డ్రగ్స్, చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యం, విద్యపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలతో అలరించారు. వైస్ ప్రిన్సిపల్, NSS, IQAC కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, సిబ్బంది, అల్యూమిని సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం హార్ట్‌ఫుల్‌నెస్ వారి ధ్యానోత్సవం కార్యక్రమం పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఆవిష్కరించారు. నిర్వాహకులు మూడు రోజుల ఉచిత ధ్యాన శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు, పడిగెల శ్రీనివాస్, న్యాయవాది దొంతుల పవన్, అల్లకట్టు సత్యనారాయణ, మహాజన్ నవీన్, కోట జీవన్, శ్యామ్ శివానందం, కంఠాల ఆనందం, వేణు, పడిగేల శివ తదితరులు పాల్గొన్నారు.

## మందిర నిర్మాణానికి విరాళం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం పద్మశాలి సంఘం అధ్యక్షులు ధ్యావనపల్లి రాజారాం చిన్న కుమారుడు ధ్యావనపల్లి తనిషి రాహుల్ దంపతులు అక్షరాల యాభై ఒక్క వెయ్యి నూట పదహారు రూపాయలు రూ. 51, 116 విరాళంగా ఇచ్చి శ్రీ శివ భక్త మార్కండేయ మందిర పునర్నిర్మాణంలో శాశ్వత సభ్యులుగా సభ్యత్వం తీసుకోవడం జరిగింది. పద్మశాలి సంఘం అధ్యక్షులు ధ్యావనపల్లి రాజారాం మాట్లాడుతూ వీరికి వీరి కుటుంబ సభ్యులకు శ్రీ శివభక్త మార్కండేయ శక్తి గణపతి స్వామి అనుగ్రహం ఎల్ల వేళలా ఉండాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# హనుమకొండలోని కాకతీయ జంతు ప్రదర్శనశాలలో వన్యప్రాణి వారోత్సవాలు



కరపత్రం ప్రతినిధి -హనుమకొండ: వన్యప్రాణి సంరక్షణపై వారం రోజుల పాటు జరిగే అవగాహన కార్యక్రమానికి నాంది పలుకుతూ, అటవీ శాఖ మరియు ఓరుగల్లు వైల్డ్లైఫ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో హనుమకొండలోని కాకతీయ జంతు ప్రదర్శనశాలలో నేడు "72వ జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు" ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా, "ఆవాసాల అనుసంధానం, వన్యప్రాణుల వికాసం" అనే 2026 ఇతివృత్తాన్ని ప్రస్తావిస్తూ వన్యప్రాణి వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. సహజ ఆవాసాలను పరిరక్షించడం, పునరుద్ధరించడం, పర్యావరణ సమతుల్యతను మరియు విభిన్న వన్యప్రాణుల మనుగడను నిర్ధారించడం యొక్క ఆవశ్యకతను వక్తలు నొక్కి చెప్పారు.వన్యప్రాణి సంరక్షణ కోసం ఆవాసాల అనుసంధానం పోషించే కీలక పాత్ర గురించి వివరిస్తూ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ ఆర్ వో) శ్రీనివాస్ గారు (హనుమకొండ) మరియు శ్రీమతి ఆశా గారు (ఏలకతుర్తి) సభను ఉద్దేశించి ప్రసంగించారు. సంరక్షణ ప్రయత్నాలలో చురుకుగా పాల్గొనాలని, జీవవైవిధ్యాన్ని పరిరక్షించే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. వ్యవస్థాపక-అధ్యక్షులు శ్రీ నాగేశ్వరరావు గారు, అటవీ శాఖ అధికారులు మరియు సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని, వన్యప్రాణుల సంరక్షణ మరియు సమాజ భాగస్వామ్యంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వారం రోజుల పాటు జరిగే వన్యప్రాణుల వారోత్సవాల పూర్తి షెడ్యూల్ త్వరలో విడుదల చేయబడుతుందని తెలిపారు.

# పవిత్ర కాశీ మట్టితో కోటిలింగాల తయారీ

కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని అక్టోబర్ 02: పవిత్ర కాశీ నుంచి తీసుకువచ్చిన మట్టితో గోదావరిఖని జీఎం కాలనీలోని శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం కోటిలింగాల తయారీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పవిత్ర మట్టితో శివలింగాలను తయారు చేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని పెద్దపల్లి జిల్లా పరిధిలో ఉన్న వివిధ దేవాలయాలకు కోటిలింగాల తయారీ కోసం కాశీ నుంచి తీసుకువచ్చిన పవిత్ర మట్టిని పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు, సామూహికంగా కోటిలింగాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని మహిళా భక్తులు, శివభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కోటిలింగాల తయారీలో భాగస్వాములు కావాలని కోరారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షులు గుండెబోయిన వెంకన్న , శోభ, విజయలక్ష్మి,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి జయంతి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామంలో శుక్రవారం రోజున శ్రీరామ్ యూత్, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారతరత్న, స్వాతంత్ర సమర యోధులు, భారత 2వ మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నీలి శ్రీనివాస్, ఉత్కం శ్రీనివాస్, మారుతి, శ్రీధర్, శేఖర్, శివ మహేష్ రాకేష్, శ్రీకర్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులు ఆపడం లేదంటూ గ్రామస్థుల రాస్తారోకో

కరపత్రం ప్రతినిధి, హుజురాబాద్:అక్టోబర్ 2

హుజురాబాద్ మండలం శాలపల్లి ఇందిరానగర్ గ్రామంలో ఆర్టీసీ బస్సులు నిలపడం లేదంటూ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట హుజురాబాద్--జమ్మికుంట ప్రధాన రహదారిపై గ్రామస్థులు, గ్రామపంచాయతీ పాలకవర్గం బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని ఆర్టీసీ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు.హుజురాబాద్--జమ్మికుంట ప్రధాన రహదారిపై ప్రతిరోజూ వందలాది ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, శాలపల్లి ఇందిరానగర్ గ్రామంలో మాత్రం బస్సులు నిలపడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారికి ఆనుకుని గ్రామం ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

**విద్యార్థులు, మహిళలు, కార్మికులకు ఇబ్బందులు**

గ్రామం నుంచి ప్రతిరోజూ అనేక మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, యువత ఉద్యోగాలు, ఇతర పనులకు, కార్మికులు కూలి పనులకు వెళ్లాల్సి ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. బస్సులు గ్రామంలో నిలపకపోవడంతో ప్రయాణికులు ప్రధాన రహదారిపై గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో ఆర్టీసీ బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలుమార్లు హుజురాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్కు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు ఆరోపించారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతోనే రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు.

**"వీ వాంట్ జస్టిస్" అంటూ నినాదాలు**

రాస్తారోకో సందర్భంగా గ్రామస్థులు "వీ వాంట్ జస్టిస్" అంటూ నినాదాలు చేస్తూ ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

# నూతన మీడియా కమిషన్ రక్షణ చట్టం తెవాలి..

- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లవర్జుల వంశీ విద్యానంద్, నారాయణదాసు అశోక్
- జర్నలిస్టులకు ఉచిత వైద్యం,ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి
- నల్ల బ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన.. వినతి పత్రాల అందజేత



కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 02: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ -ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశం తీసుకున్న కీలక నిర్ణయం మేరకు మహాత్మా గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని టీయూడబ్ల్యూజే-ఐజేయూ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పాత్రికేయుల డిమాండ్ల దినం కార్యక్రమాన్ని నిర్వహించారు.సమాజంలో నిరంతరం వార్తల సేకరణ కోసం కష్టపడే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, వారి హక్కులను సమర్థవంతంగా పరిరక్షించాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా జిల్లా కేంద్రంలోని గాంధీజీ విగ్రహానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, నివాళు లర్పించారు.అనంతరం సమాజం కోసం ప్రాణాలు అర్పించిన అమర జర్నలిస్టుల స్మారకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించారు. జర్నలిస్టుల హక్కులు మరియు భద్రతను తక్షణమే కాపాడాలంటూ పాత్రికేయులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని సంబంధిత అధికారులకు తమ డిమాండ్లతో కూడిన సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షులు మల్లవర్జుల వంశీ విద్యానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభమైన పత్రికారంగం, మీడియా సిబ్బంది రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రంగంలోకి దిగి రక్షణ చర్యలు తీసుకోవాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. సాంకేతికత వేగంగా విస్తరిస్తున్న నేటి డిజిటల్ యుగానికి అనుగుణంగా నూతన సమగ్ర మీడియా కమిషన్ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై పెరుగుతున్న భౌతిక దాడులను సమర్థవంతంగా అరికట్టేందుకు పటిష్టమైన ప్రత్యేక కేంద్ర రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కోరారు. కొత్తగా అమల్లోకి తెచ్చిన కార్మిక కోడ్ల వల్ల నష్టపోయిన 1955, 1958 నాటి చట్టబద్ధ రక్షణలను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. దాదాపు రెండు దశాబ్దాలుగా నిలిచిపోయిన వేతన సవరణలను దృష్టిలో ఉంచుకుని, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ రంగాల్లో పనిచేస్తున్న అన్ని విభాగాల మీడియా ఉద్యోగులకు వర్తించేలా నూతన వేతన మండలిని తక్షణమే ఏర్పాటు చేయాల డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన స్పష్టమైన హామీ మేరకు జర్నలిస్టులకు ఇళు ్ళ,ఇళ్ల స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు వీలుగా హెల్త్ కార్డులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే పాత్రికేయులందరికీ ఆర్టీసీ బస్సులలో పూర్తి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. రైల్వే పాసులను పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టుల సుదీర్ఘకాల డిమాండ్లను వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో జిల్లావ్యాప్తంగా శాంతియుత పద్ధతిలో పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ కు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, నియోజకవర్గ, మండల స్థాయి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడా ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తాం..

» రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ
» 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్లో రామగుండం పోలీసుల సత్తా
» 1 రజతం,6 కాంస్యాలతో మొత్తం 7 పతకాలు



కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని అక్టోబర్ 02: పోలీసు అధికారులు, సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 క్లస్టర్--సీ పోటీలు హైదరాబాద్లోని ఆర్బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు నిర్వహించారు. కాళేశ్వరం జోన్--X తరపున పాల్గొన్న రామగుండం పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు టేబుల్ టెన్నిస్,బ్యాడ్మింటన్ విభాగాల్లో 1 రజతం, 6 కాంస్య పతకాలు సాధించి మొత్తం 7 పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ క్రీడాకారులను శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో రామగుండం కమిషనరేట్ తరపున మొత్తం 17 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.టేబుల్ టెన్నిస్ విభాగంలో 5 కాంస్య పతకాలు సాధించారు. 50ం మిక్స్డ్ డబుల్స్లో ఏసీపీ ప్రతాప్,డబ్ల్యూపీసీ ఎం.వనిత జోడీ కాంస్య పతకం సాధించింది. 40ం సింగిల్స్లో పీసీ ఎం.ఉదయ్ కిరణ్, పీసీ-3499 కాంస్య పతకం సాధించారు. ఓపెన్ ఉమెన్స్ డబుల్స్లో డబ్ల్యూపీసీ కె.విజయ, కె.దీప జోడీ కాంస్య పతకం సాధించింది. 40ం ఉమెన్స్ డబుల్స్లో డబ్ల్యూపీసీ ఎం.వనిత, కె.విజయ, పీసీ-1469 కాంస్య పతకం సాధించారు. 40ం మిక్స్డ్ డబుల్స్లో పీసీ డి. రాజేందర్, పీసీ-2952, డబ్ల్యూపీసీ ఎం. వనిత జోడీ కాంస్య పతకం సాధించింది.
బ్యాడ్మింటన్ విభాగంలో
ఓపెన్ సింగిల్స్లో కె. సురేష్ రజత పతకం సాధించారు.ఓపెన్ మిక్స్డ్ డబుల్స్లో కె.సురేష్, కె.విజయ జోడీ కాంస్య పతకం సాధించింది.ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి కమిషనరేట్కు మంచిపేరు తీసుకురావడం అభినందనీయమని అన్నారు. పోలీసు విధుల్లో నిరంతరం ఒత్తిడితో పనిచేసే అధికారులు, సిబ్బందికి క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపుతున్న పోలీసు అధికారులు, సిబ్బందిని శాఖ తరపున ప్రోత్సహిస్తూ అవసరమైన సహకారం అందిస్తామని సీపీ తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు మల్లేశం, శేఖర్, రమేష్, సీసీ సందీప్, ఆర్ఎస్ఐలు, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్, సభ్యులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసేడు గ్రామానికి వైకుంఠ రథం అందజేత

» సోదరుడు సంపత్ జ్ఞాపకార్థం గ్రామ సర్పంచ్ రేణుకుంట్ల శ్యామలకుమార్ సేవా కార్యక్రమం



కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట అక్టోబర్ 2

సిరిసేడు: గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సిరిసేడు గ్రామ సర్పంచ్ రేణుకుంట్ల శ్యామలకుమార్ వైకుంఠ రథాన్ని గ్రామానికి అందజేశారు. తన సోదరుడు, తన ప్రాణానికి ప్రాణమైన కీ.శే. రేణుకుంట్ల సంపత్ జ్ఞాపకార్థంగా ఈ వైకుంఠ రథాన్ని గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణుకుంట్ల శ్యామలకుమార్ మాట్లాడుతూ.. తన తమ్ముడు ప్రజాసేవలో ఉండాలని ఎప్పటికైనా బలంగా కోరుకున్న వ్యక్తి తన అన్న కీ.శే. రేణుకుంట్ల సంపత్ అని తెలిపారు. సంపత్ ఈ లోకంలో లేకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. ఆయన జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేందుకు, గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా వైకుంఠ రథాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.గ్రామ ప్రజల ఆశీర్వాదంతో ప్రజా సంక్షేమం కోసం ఎల్లవేళలా ముందుండి పనిచేస్తానని శ్యామలకుమార్ తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు.వైకుంఠ రథాన్ని గ్రామానికి అందజేసిన సర్పంచ్ శ్యామలకుమార్కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, దీవెనలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వంశీ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీను, కారోబార్ రాంబాబు, మాజీ ఎంపీటీసీ చిన్నరాయుడు, జేకే, దామోదర్, ముస్తఫా, షఫీ, శేఖర్, దాస్, అంజి, సంపత్, చిరంజీవి, జానీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేవీపీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం

» కుల వివక్ష నిర్మూలనతోనే సమానత్వం సాధ్యం: కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వద్దూరి కిషోర్

కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట అక్టోబర్ 2

జమ్మికుంట: భారతదేశంలో కుల వివక్షను నిర్మూలించి, అందరూ సమానత్వంతో జీవించే సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ (కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) జిల్లా ఉపాధ్యక్షులు వద్దూరి కిషోర్ అన్నారు. కేవీపీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జమ్మికుంట పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో జెండావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వద్దూరి కిషోర్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దళితులు, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు ఇప్పటికీ అనేక సామాజిక, ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే అట్టడుగు వర్గాలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయని పేర్కొన్నారు.దేశంలోని పలు ప్రాంతాల్లో దళితులపై వివక్ష, దాడులు చోటుచేసుకుంటున్నాయని, కుల వివక్షకు వ్యతిరేకంగా అన్ని అట్టడుగు వర్గాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల పరిరక్షణకు కేవీపీఎస్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు.కేవీపీఎస్ 1998 అక్టోబర్ 2న ఏర్పాటైందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో దళితుల సమస్యలపై సైకిల్ యాత్రలు, ఉద్యమాలు నిర్వహించి అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాడిందని కిషోర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధులు, జస్టిస్ పున్నయ్య కమిషన్, దళితులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం నిర్వహించిన ఉద్యమాలను ఆయన గుర్తుచేశారు.భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విద్య, వైద్యం ఉచితంగా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కుల వివక్ష, అంటరానితనం పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే కేవీపీఎస్ ప్రధాన లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్, కేవీపీఎస్ మండల నాయకులు వి. సూర్యారావు, తెలంగాణ హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శనిగరపు చంద్రమోహన్, సిరికొండ మదనయ్య, రాజు, రజాక్, కిరణ్, రాజయ్య, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



# గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కమిషనర్

కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట అక్టోబర్ 2

జమ్మికుంట పట్టణ పరిధిలో గాంధీ జయంతి పురస్కరించుకొని గాంధీ 157వ జయంతి వేడుకలలో భాగంగా స్థానిక గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ గాంధీ అహింసా, శాంతియుత పోరాటం ద్వారా మన హక్కులను పొందే మార్గాన్ని చూపిన జాతిపిత "మహాత్మా గాంధీ" జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులు అర్పిస్తు మనం వారు చూపిన బాటలో నడుస్తూ వారి ఆశయాలు ముందుకు సాగేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి,కౌన్సిలర్లూ మేనేజర్ గుర్రాల రాజిరెడ్డి, ఆర్ ఐ భాస్కర్,శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్, వార్డ్ ఆఫీసర్స్ కార్యాలయ సిబ్బంది పలువురు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

